

- ఎన్జీటీ అభ్యంతరాలపై సుప్రీం కోర్టుకు ప్రభుత్వం
- స్టే ఇచ్చిన కోర్టు.. మళ్లీ ప్రారంభం కానున్న క్వారీలు



త్వరలో ఇసుక తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో మానేరు నదిలో ఇసుక క్వారీల నిర్వహణపై ఎన్జీటీ అభ్యంతరాలపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో జిల్లాలో క్వారీల నిర్వహణకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలోని మానేరు నదిలో చెక్‌డ్యాంల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. దాదాపు 19 చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చెక్ డ్యాంల నిర్మాణాలు కొన్ని పూర్తికాగా, పలు చెక్ డ్యాంల నిర్మాణాలు జరుగుతున్నాయి. చెక్‌డ్యాం లోపల పెద్ద ఎత్తున ఇసుక పేరుకుపోయిందని, తొలగించకపోతే నీటి నిలువ తక్కువగా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో అక్కడ పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు నీటిపారుదల శాఖ, భూగర్భ జల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇక్కడ 25 చోట్ల సుమారు కోటి 32 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీయాలని పేర్కొనడంతో ప్రభుత్వం 2021 లో ఇసుక క్వారీల కోసం టెండర్లు నిర్వహించింది. ఆ మేరకు టెండర్లు తగ్గించుకున్న కాంట్రాక్టర్లు పలుచోట్ల ఇసుక క్వారీలను ప్రారంభించారు. టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్లలో ఇసుక క్వారీలను దక్కించుకున్న కాంట్రాక్టర్లు మానేరు నది నుంచి ఇసుకను తోడి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేశారు. అక్కడినుంచి టీఎస్ఎండీసీ ఆన్‌లైన్ల ద్వారా ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి డంపింగ్ యార్డులో లోడింగ్ చేశారు.

సర్వేకు ఆదేశించిన ప్రభుత్వం..

ఇసుక క్వారీల విషయమై పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే టీఎస్ఎండీసీ ఇసుకను తోడుతున్నదని, ఈ ఇసుక క్వారీల వల్ల రోడ్డు దెబ్బ తినడంతో పాటు, దుమ్ము ధూళితో ఆయా గ్రామాల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని జిల్లాకు చెందిన అంబటి కరుణాకర్‌రెడ్డి, గొట్టేముక్కుల సురేష్‌రెడ్డి తదితరులు చెన్నైలోని ఎన్జీటీ కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు కోర్టు విచారణ జరిపింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లుగా గుర్తించిన ఎన్‌జీటీ కోర్టు నాలుగు మాసాల క్రితం మానేరు నదిలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని తీర్పు వెలువరించింది. అలాగే ఆయా శాఖలకు 50 కోట్ల జరిమానా కూడా విధించింది. అప్పటివరకు 78 వేలకు పైగా క్యూబిక్ మీటర్ల ఇసుకను అధికారికంగా తోడి తరలించారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్జీటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలపై సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన కోర్టు తాత్కాలికంగా ఎన్జీటీ తీర్పుపై స్టే విధించింది. దీంతో మానేరు నదిపై ప్రభుత్వం ఇసుక తవ్వకాల కోసం చర్యలు చేపడుతున్నది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం తొగర్రాయి, కదంబాపూర్, ఓదెల మండలం గుండ్లపల్లి 1, 2 మడక, కనగర్తి, కిష్టంపేట, మొట్లపల్లి, ముత్తారం మండలం ఓడేడు, ముత్తారం, ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో ఇసుక క్వారీలు గతంలో నడిచాయి. సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఆ క్వారీలను తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నది ప్రవాహం, డంపింగ్ అవకాశాలు, అక్కడి నుంచి ఎగుమతి చేసే విషయాలపై సర్వే చేయాలని టీఎస్ఎండీసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయమై ఎన్జీటీ కోర్టును ఆశ్రయించిన అంబటి కరుణాకర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన విషయమై తాము కూడా కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద
- ఉదయం 9.30 నుంచి 11.15 గంటల వరకు వేడుకలు



స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

పెద్దపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలను కలెక్టరేట్ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9.30 గంటల నుంచి 11.15 గంటల వరకు నిర్వహించనున్నారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలో పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించి, ప్రజలను ఉద్దేశించి జిల్లాలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సందేశాన్ని ఇవ్వనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖలు ప్రదర్శించే స్టాల్స్‌ను పరిశీలించనున్నారు.

కాందిశీకుల సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారంపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఇందులో 30 సంవత్సరాలుగా అంతర్గాం స్పిన్నింగ్‌మిల్లు, వీవింగ్‌మిల్లు మూతపడ్డాక వారి సమస్యలు, రావాల్సిన బకాయిల గురించి చర్చించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో గంగయ్య, అంతర్గాం తహసీల్దార్ రమేష్, చేనేత జౌళిశాఖ సహాయసంచాలకులు ఎస్ చరణ్, అధికారులు వేణుగోపాల్, ఎస్.చరణ్, హేమలత, చేనేత సంతోష్ కుమార్, తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ

రామగిరి, ఆగస్టు 14: మండలంలోని బేగంపేట్ పశువైద్యశాలను బుధవారం జిల్లా పశువైద్యాధికారి శంకర్ సందర్శించారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేపట్టారు. రామగిరి మండలంలోని సుందిల్లా, ముస్త్యాల గ్రామాలలో 1216 వందల పశువులకు టీకాలు వేయడం జరిగిందని, అలాగే తెల్ల ఆవులకు ముద్ద చర్మం వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ అధికారికి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ ఆఫీసర్ నారాయణ ఉన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన

సుల్తానాబాద్, ఆగస్టు 14: అత్యవసర సమయాలలో అపద వేళల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మనకు అందుబాటులో ఉంచిన హెల్ప్‌లైన్ నంబర్లను ఆశ్రయించాలని సుల్తానాబాద్ సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ దారవేణి స్వప్న పిలుపునిచ్చారు. బుధవారం సఖీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో పలు అంశాల గురించి వివరించారు. 100, 181,1098,112,1930, 14567 తదితర హెల్ప్‌లైన్ నంబర్లు వాటిని ఏ సందర్భాలలో ఆశ్రయించాల్సి ఉందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌తో పాటు వీవోలు, సీఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్స్, డ్రమ్స్ పంపిణీ

మంథనిరూరల్, ఆగస్టు 14: మండలం కన్నాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీషర్ట్స్, డ్రమ్స్‌ను మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నలమాసు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాదేవి-సురేష్‌రెడ్డి హాజరయ్యారు. 65 మంది విద్యార్థులకు స్కూల్ పేరుతో ప్రింట్ అయిన టీషర్టు కావేటి భూమయ్య కూతురు బోయిని స్వరూప-సమ్మయ్య డొనేట్ చేశారు. సుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్‌లు విద్యార్థులకు డ్రమ్స్ అందజేశారు.

జూలపల్లి, ఆగస్టు 14 : మండలంలోని తేలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన, గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి సీఐ జవ్వాజి సురేష్ బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు టీషర్ట్స్, దుస్తులను అందజేశారు. మాజీ సర్పంచులు దారబోయిన నర్సింహయాదవ్, గొడిసెల రవి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 14: తెలంగాణ ఓపెన్‌స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో మాధవి తెలిపారు. బుధవారం జిల్లాలోని డీఈవో కార్యాలయంలో ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలపై గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేది నుంచి సెప్టెంబర్ 10వ తేది వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. చదువు మధ్యలో మానేసిన, వివిధ కారణాలతో చదువులను కొనసాగించలేని వారు, అంగన్‌వాడీ మహిళలు, ఆశా వర్కర్లు తదితరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7095678143లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సంజీవయ్య, సమన్వకర్త పి.రాజారెడ్డి, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక జాతీయ గీతాలాపన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 14:హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని అడ్డగుంటపల్లి అబ్దుల్ కలాం విగ్రహం వద్ద సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం లక్ష్మీనగర్‌లో ఇంటింటికి జాతీయ జెండాలను అందజేశారు. బీజేపీ నాయకులు కాసిపేట శివాజీ, సోమారపు లావణ్య అరుణ్‌కుమార్, జక్కుల నరహరి, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మూకిరి రాజు, మాదాసు సుధాకర్, పిడుగు కృష్ణ, సునీల్, సురేందర్, ఎత్తిరాజు సురేష్, రాజ్‌కుమార్, నవీన్‌గౌడ్, మహేష్, సుల్వ పద్మ, డాక్టర్ లక్ష్మీవాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా దివ్యాంగురాలు మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 : మండలంలోని నిట్టూరుకు చెందిన జోగుల శారద (30) అనే దివ్యాంగురాలు అనుమానాస్పదంగా మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శారద ఇంట్లోనే ఉండేది. బుధవారం తల్లి ఇంటికి వచ్చే సరికి కుర్చీలో పడిపోయి ఉంది. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావులు చేరుకొని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. కూతురు మృతిపై అనుమానం ఉందని శారద తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకులాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రెసిడెన్షియల్ గురుకులాలు, సంక్షేమ హాస్టల్లో నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ శ్రీహర్ష కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ హాస్టల్, రెసిడెన్షియల్ గురుకులాల, కేజీబీవీ నిర్వహణపై అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి సంబంధిత హాస్టల్ వార్డెన్‌లు, గురుకులాల ప్రిన్సిపాల్‌లతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ గురుకులాలో పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు అందించే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియగా ఉండాలని, వర్షాకాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈగలు, దోమలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాల్లో ఎక్కడ నీరు నిల్వఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. గురుకులాల్లో, సంక్షేమ హాస్టల్లో ఎక్కడా డార్క్‌ఏరియా ఉండవద్దని, ప్రతిచోట లైట్ ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరా నాణ్యతను పరి శీలించాలన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. హాస్టల్స్ పరిసరాలలో ఎక్కడైనా పాములు, తేళ్లు ఉండకుండా పరిశీలించాలని, ఒకవేళ ఎక్కడైనా గుర్తిస్తే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎంల ద్వారా విద్యార్థులకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన మందులు అందుబాటులో పెట్టాలని, వైరల్ జ్వరాలు లక్షణంగల పిల్లలకు వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకునే ముందు, బాత్‌రూం వినియోగించిన తర్వాత చేతులను విద్యార్థులు తప్పనిసరిగా శుభ్రం చేసుకునేలా చూడాలని సూచించారు. రెసిడెన్షియల్ గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌లో స్టాఫ్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా వార్డెన్స్ చూడాలని, విద్యార్థులకు అందించే ఆహారం వేడిగా ఎప్పటికప్పుడు తయారు చేసి అందించాలని, నిల్వ ఉంచిన భోజనం పెట్టవద్దని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నాగలైశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

జాతీయ రహదారి భూసేకరణపై శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని, ఆగస్టు 14: వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసే దిశగా అధికారులు శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ మంథని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జాతీయ రహదారి కోసం చేపట్టాల్సిన, భూసేకరణ, పెండింగ్ ధరణి సమస్యలు, వివిధ సర్టిఫికెట్ల జారి మొదలగు అంశాలపై మంథని రెవెన్యూ డివిజన్ అధికారి ఈ హనుమానాయక్‌తో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని, సంబంధిత రైతులు కలెక్టర్ వద్దకు ఆర్బిట్రేషన్ వచ్చే విధంగా చూడాలని, భూ సేకరణ పూర్తిచేసిన భూమిని వెంటనే జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జారీ చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో వన మహోత్సవంలో అదనపు కలెక్టర్, ఆర్డీవో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో మంథని తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 : మండలంలోని హన్మంతునిపేటలో పారిశుధ్య పనులు, గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత పరిశీలించారు. సెగ్రిగేషన్‌షెడ్లు, పల్లె ప్రకృతి వనంతోపాటు పలు వీధుల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట ఎంపీవో ఫయాజ్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌తో పాటు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గాంధేయ మార్గమే శరణ్యం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 14: నేటి యువతరానికి గాంధేయ మార్గమే శరణ్యమని ఎన్‌వైపీ బాధ్యులు యాదవరాజు అన్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలో జరిగిన క్విట్ ఇండియా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, పర్శ రాములు, జోషిక, సంతోష్, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

ఓదెల, ఆగస్టు 14 : మండలంలోని పోత్కపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మధుబాబు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై మంగళవారం ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్ మేనేజర్ శివ, ఫీల్డ్ ఆఫీసర్ ఖేమ్ చంద్, మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

- సీఐఎస్ఎఫ్ జవానుల తిరంగా, బైక్ ర్యాలీలు - జాతీయ పతాకంతో విద్యార్థుల భారీ ప్రదర్శనలు



పీటీఎస్‌లో సీఐఎస్ఎఫ్ జవానుల తిరంగా ర్యాలీ

జ్యోతినగర్, ఆగస్టు 14 : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం ఎన్టీపీసీలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పీటీఎస్‌లోని ఎన్టీపీసీ ఆసుపత్రి నుంచి టౌన్‌షిప్ గేటు వరకు చేతిలో త్రివర్ణ పతాకాలను పట్టుకొని ర్యాలీలో(ఫ్లాగ్ మార్చ్) పాల్గొన్నారు. అనంతరం సీఐఎస్ఎఫ్ రామగుండం యూనిట్ జవానులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ముకేశ్ కుమార్ ఆధ్వర్యంలో మేడిపల్లి సెంటరు నుంచి ప్రధానవీధుల ద్వారా పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఆంజనేయ రాజు, జవానులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో జాతీయ పతాకంతో ఆరు వందల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి తోట లవణ్ కుమార్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, విభాగ కన్వీనర్ అజయ్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, సోషల్ మీడియా కో కన్వీనర్ శ్రీపతి సాయితేజ, రాష్ట్ర ఈసీమెంబర్ అజయ్, నాయకులు సందీప్, అభి,రాకేష్, వినయ్, సిద్దార్థ, నితిన్, ఆన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, ఆగస్టు 14: మండలంలోని సెంటినరీకాలనీలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం బుధవారం విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. సెంటినరికాలనీ నుంచి తెలంగాణ సెంటర్ వరకు 1000 మీటర్ల జాతీయ జెండాతో ప్రగతి, వాణి, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులు ర్యాలీని చేపట్టారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మంథని, ఆగస్టు 14: పట్టణంలోని పురవీధుల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా జెండాను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన భారీ జాతీయ జెండాతో పురవీధుల్లో వివిధ పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలపల్లి, ఆగస్టు 14 : మండల కేంద్రంలో బుధవారం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువకులకు జాతీయ జెండాలను పంపిణీ చేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని జాతీయ వాదాన్ని ప్రదర్శించాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సుల్తానాబాద్, ఆగస్టు 14: ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి నాలుగు కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. సుల్తానాబాద్ చెరువు వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహ నంపై ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా నాలుగు గంజాయి ప్యాకెట్లు అభ్యమయ్యాయి. వాటిని కంటా వేయగా నాలుగు కిలోలుగా తేలింది. ఈ మేరకు అతడిని విచారించగా తన పేరు బద్దిపడిగె సంజీవ రెడ్డి అని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మం డలంలోని ఎర్కలగూడెం (లింగాపూర్) గ్రామమని ఒప్పుకున్నాడు. ఈ గంజాయిని తన బావ ఒడిశాలో ఉంటున్న రాజారాం ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 13న హుజురాబాద్‌లో తనకు అందజేశారని చెప్పాడు. బావ ఆదేశం మేరకు ఆ గంజాయిని గోదావరిఖనిలో అప్పగించేందుకు బుధవారం స్వగ్రామం నుంచి బయలు దేరానని తెలిపాడు. సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయితో సహా బైక్‌ను కూడా సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

జమ్మికుంటలో నిత్య జనగణమన

● ఏడేళ్లుగా కొనసాగుతున్న జాతీయ గీతాలాపన

● ఉత్సాహంగా పాల్గొంటున్న ప్రజలు



జమ్మికుంటలో జాతీయగీతం ఆలపిస్తున్న ప్రజలు (ఫైల్)

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14: జమ్మికుంటలో నిత్య జనగణమన జాతీయగీతం ప్రారంభమై ఏడేళ్లు కావస్తోంది. ప్రతి రోజు జాతీయగీతం ఆలాపన పూర్తి అయిన తర్వాతే ప్రజలు తమ తమ పనుల్లో నిమగ్నం అవుతున్నారు. నిత్య జాతీయగీతం ఆలాపన కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాలు సైతం స్ఫూర్తిగా తీసుకొని ఆయా ప్రాంతాల్లో ప్రారంభించారు. జమ్మికుంట పట్టణంలో 2017 ఆగస్టు 15న నిత్య జనగణమన కార్యక్రమాన్ని అప్పటి సీఐ పింగిలి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. గాంధీ చౌరస్తా, మోత్కుల గూడెం చౌరస్తా, సంపత్ పాన్‌షాప్, పాత సిటికేబుల్ వీధి, కొత్తపల్లి, ఆర్టీసీ బస్టాండ్, మడిపల్లి క్రాస్‌రోడ్, ఐబీపీ పెట్రోల్ బంక్, మురళీ థియేటర్, కూరగాయల మార్కెట్, మున్సిపల్ కార్యాల యం, ప్రభుత్వ డిగ్రీ కళాశా ల మైదానం, గణేశ్‌నగర్, రైల్వే స్టేషన్, పంచముఖ హనుమాన్ ఆలయం సమీ పంలో మొత్తం 17ప్రధాన కూడళ్లలో మైకులు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 7.30గంటలకు దేశభక్తి గీతాలు ప్రారంభించి, సరిగ్గా 8 గంటలకు జాతీయగీతం ప్రారంభి స్తారు. దీంతో ఎక్కడి వారు అక్కడే నిలబడి జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది ఇక్కడకు వచ్చి జాతీయగీతం ఆలా పన కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి ఆకర్షితులయ్యారు. హరియాణా రాష్ట్రంలో ఫరిదా బాద్ జిల్లా మణక్‌పూర్ గ్రామం, పంజాబ్, జమ్మికుంట మండలం నాగంపేట, ధర్మారం, కోరుట్ల, మెట్ పల్లి, గోదావరిఖని, లక్షట్ పేట, జగిత్యాల జిల్లా మెడిపల్లి, ప్రాంతాల్లో జమ్మికుంటను ఆదర్శంగా తీసుకొని నిత్య జనగణ మన జాతీయ గీతాన్ని ఆలపించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

21 నుంచి ఎల్ఎల్‌బీ పరీక్షలు

గణేశ్‌నగర్, ఆగస్టు 14 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.

ఢిల్లీ వేడుకలకు పెద్దపల్లి జిల్లా విద్యార్థులు..



మహ్మద్ అల్ రిషన్



అభిగ్న

ఓదెల, పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 14 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లా విద్యార్థులకు ఆహ్వానం అం దింది. ఓదెల మండలంలోని ఓదెల మోడల్ హైస్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.అభిగ్న, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.సుజాత వేడుక లకు హాజరుకానున్నారు. అలాగే పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి మహ్మద్ అల్ రిషన్‌కు వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందించి. విద్యార్థులకు ఆహ్వానం రావడంపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అపహరించి.. అమ్ముకోవాలనుకున్నాడు..

బాలుడి కిడ్నాప్ డీల్ రూ. 1.30 లక్షలు

● మధ్యవర్తితో కుదిరిన బేరం

● నిందితుడికి గతంలో నేర చరిత్ర

● 18 గంటల్లో కిడ్నాప్‌ను ఛేదించిన పోలీస్‌లు



మెట్‌పల్లిలో నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అశోక్ కుమార్

మెట్‌పల్లి, ఆగస్టు 14(ఇబ్రహీంపట్నం): చిన్నచిన్న దొంగతనాలు చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడిన దొంగ ఒక్కసారిగా ఎదగాలనుకున్నాడో ఏమో గాని ఏకంగా బాలుడిని అమ్ముకోవడానికి 1.30 లక్షలకు బేరం కుదుర్చుకొని రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి పోలీస్‌లకు దొరికి కటకటాల పాలయ్యాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడ లో మంగళవారం బాలుడు కిడ్నాప్ అయ్యాడు. పోలీసులు 18 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించారు. బాలుడి కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను ఎస్పీ అశోక్‌కుమార్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. పట్టణంలోని దుబ్బ వాడలో ఈ నెల 13న తన అక్కతో కలిసి కిరాణ కొట్టుకు వెళ్లిన శివ అనే రెండేళ్ల బాలుడి ని గుర్తు తెలయని వ్యక్తి కిడ్నాప్ చేయగా బాలుడి తల్లి దండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ అధారంగా రాత్రి నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తుండగా బుధవా రం మధ్యాహ్నం వెంకట్రావ్‌పేట శివారులో జాతీయ రహదారిపై బైక్‌పై బాలుడిని నిందితుడు తీసుకెళ్తున్నట్టు గమనించి వెంబడించి పట్టుకు న్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బాలుడి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బాలుడిని సురక్షితంగా పట్టుకుని పోలీస్‌లు తల్లిదం డ్రులకు అప్పగించడంతో పోలీస్‌లకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతాలు తెలిపా రు. జల్సాలకు అలవాటు పడిన ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడని ఎస్పీ తెలిపారు. నాగేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. బాలుడి కిడ్నాప్ కేసును 18 గంటల్లోనే ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

● **పక్కా ప్లాన్‌తో కిడ్నాప్...:** డబ్బు ఎలాగైన సంపాదించాలనే ఆశతో నాగేష్ పక్క ప్లాన్‌గా బాలుడ్ని కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగేష్ మొదటి నుంచి నేర చరిత్ర కలిగినవాడేనని గతంలో పసుపు దొంగతనం, బైక్‌లు, గొర్లతో పాటు పలు దొంగతనాలకు పాల్పడి నట్లు తెలుస్తోంది. నాగేష్ వ్యవహార శైలిపై విసుగు చెందిన అతడి భార్య గొడవ పెట్టుకుని కూతురుతో కలిసి నాగేష్‌కు దూరంగా ఉంటోంది. కాగ మంగళవారం సాయంత్రం కిడ్నాప్ చేసిన బాలుడిని పట్టణ శివారులోని అర్బన్ కాలనీ, అమ్మక్కపేట గ్రామానికి సమీపంలో ఉన్న కాలనీలో దాచి పెట్టిన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో తాను పసుపు దొంగతనం చేసి ఉంచిన ఇంటిలోనే బాలుడిని దాచినట్లు సమాచారం. బాలుడిని అమ్మేం దుకు అదే కాలనీకి చెందిన ఓ మహిళ మధ్యవర్తిత్వం వహించి 1.30 లక్షలకు డీల్ కుదిర్చినట్లు తెలుస్తోంది. పక్కా సమాచారంతో పోలీస్‌లు అక్కడికి వెళ్లగా సమాచారం తెలుసుకున్న నాగేష్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీనితో వెంబడించి బాలుడిని పట్టుకున్నట్లు సమాచారం. గతంలోనే నాగేష్‌పై రెండు పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు ఉన్నట్లు తెలిసింది. నిందితుడు బాలుడిని అమ్మేందుకు కోరుట్లకు చెందిన వారితో డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు

● మూడు కేసుల్లో తీర్పులు

● ఒకరికి జీవిత ఖైదు, మరొకరికి ఏడేళ్ల జైలు

● మరో రెండు కేసుల్లో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

● సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, ఆగస్టు 14: నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు కేసుల్లో తీర్పులు వెల్లడయ్యాయని, ఈ కేసుల్లో నిందితులైన కొడుకుకు జీవిత ఖైదు, తండ్రికి ఏడేళ్ల జైలు శిక్ష, మరో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధించార న్నారు. వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డికి జీవిత ఖైదు, రూ. 5వేల జరిమానా, మరో నిందితు డైన బారాజు నర్సింహారెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ 3 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తీర్పు ఇచ్చారన్నా రు. వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, ఎమి రెడ్డి రాంరెడ్డి, కనకరెడ్డి, లచ్చిరెడ్డిల మధ్య చాలాకాలంగా భూ తగాదాలు ఉన్నాయన్నారు. మే 25, 2015న దాడుల్లో ఎమిరెడ్డి రాంరెడ్డికి తీవ్రగాయా లై చికిత్సకోసం తరలిస్తుండగా మృతిచెందాడన్నారు. దాడి చేసి రాంరెడ్డి మృతికి కారకులైన తండ్రి కొడుకులైన బారాజు మల్లారెడ్డి, నర్సింహా రెడ్డి లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఈ కేసులో అప్పటి సీఐ శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా పిపి నర్సింగరావు కేసు వాధించగా 17మంది సాక్షుల ను కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, రమేశ్‌లు కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వ పరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధించారన్నారు.

● ఓ హత్యాయత్నం కేసులో కోనరావుపేట మండ లంలోని ధర్మారం గ్రామానికి చెందిన గంగుల రమేశ్ అనే నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ. 1100 జరిమానా విధి స్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారన్నారు. 2018లో కాళేశ్వరం ప్రాజెక్టు పనిలో భాగంగా టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసే రమేశ్‌ను విధుల నుంచి తొలగించారని, ఇది మనసులో పెట్టుకొని రమేశ్ ప్రాజెక్టు మేనేజర్ చేకూరి కృష్ణంరాజుపై హత్యాయత్నం చేశాడన్నారు. ఈ కేసులో అప్పటి సీఐ పర్శరాములు నిందితుడు రమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. ఈ కేసులో పిపి వేముల లక్ష్మి ప్రసాద్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ లతీఫ్ 10మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి రాధి క జైస్వాల్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ. 1100 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఆయన తెలిపారు.

● సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన కావలి లక్ష్మిపై తన భర్త కావలి రాజు కిరోసిన్ పోసి హత్యయత్నానికి పాల్పడ్డాడని, ఈ కేసులో భర్త రాజుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధి స్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు ఇచ్చారన్నారు. సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించు కోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయవిచారణ, నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారన్నారు. మూడు కేసులలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన పీపీలు వేముల లక్ష్మి ప్రసాద్, నర్సింగరావులను, సీఎంఎస్ ఎస్ఐ రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుళ్లు రమేశ్, మహేందర్, లతీఫ్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, నరేందర్‌లను ఎస్పీ అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి గౌరయ్య బుధవారం అదృశ్యమయ్యాడని కుటుంబీకులు, స్థానికులు తెలిపారు. గౌరయ్య తన భార్య ఇటీవల మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాడని పేర్కొన్నారు. కొడుకులకు వేరుగా వేరుగా నివసిస్తున్నారు. బుధవారం వేకువజామున తాను ఉంటున్న ఇంటికి తాళం వేసి గౌరయ్య బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వారు, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని కుటుంబ సభ్యులు వివరించారు.

14 మందిపై కేసు నమోదు

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని జయ్యారం గ్రామశివారులోని అంకమెట్టుగుట్ట వద్ద డబ్బులు పెట్టుకొని చిత్తుబొత్తు ఆడుతున్న 14 మందిని బుధవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. 14 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 75,800 నగదును, 14 సెల్‌ఫోన్లు, 6 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 14: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు 3,598 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.34 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మధ్యమానేరు నుంచి 6,400 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను బుధవారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 4,303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.847 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా పాశం తిరుపతి నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ రూరల్, ఆగస్టు 14: సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పాశం తిరుపతిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు నియామక పత్రాన్ని బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొరటాల శివరామకృష్ణయ్య, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

ముత్తారం, ఆగస్టు 14: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయ తీ పరిధి రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి ప్రసన్న (17) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో బాలిక మృతిచెందింది. ఈనెల 10న జ్వరంతో ప్రసన్న తండ్రి నారాయణ ఖమ్మంపల్లికి చెందిన ఓ ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. అయినా జ్వరం ఎక్కువ కావడంతో హైదరాబాద్‌కు తరలించగా బుధవారం ఉదయం మృతి చెందింది. కాగా, ఖమ్మంపల్లిలోని ఆర్ఎంపీ ఇచ్చిన అధిక డోస్ ఇంజక్షన్ వికటించడం వల్లనే తమ కూతురి పరిస్థితి విషమించిందని హైదరాబాద్‌లోని వైద్యులు పేర్కొన్నారని బాలిక తల్లిదండ్రులకు ఆరోపిస్తున్నారు. బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు తన ఇంటి ఎదుట ఆందోళన చేసే అవకాశం ఉందని భావించిన సదరు ఆర్ఎంపీ రామగుండం సీపీని ఆశ్రయించాడు. ఈ మేరకు సీపీ ఆదేశాలతో రామగిరి ఎస్సై బాలిక మృతదేహాన్ని తీసుకవస్తున్న అంబులెన్స్‌ను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

దేవాదాయశాఖ అదనపు కమిషనర్ సుప్రియ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుప్రియ

కరీంనగర్ కల్చరల్ ఆగష్టు 14: ఉత్తమ సేవల తోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్(ఏసీ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఆమె గత ఏసీ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్యలున్నా కార్యాలయంలో సంప్రదిస్తే పరిష్క రించేందుకు కృషి చేస్తానని అన్నారు. మెదక్ జిల్లా ఏసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఉద్యోగులు చక్కని సహకారం అందించారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, పెద్దపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఈఓలు కందుల సుధాకర్, సదయ్య, నాగుల అనిల్‌కుమార్, ఎండపెల్లి మారుతి, కొన్న కాంతారెడ్డి, వుడుతల వెంకన్న, నాగారపు శ్రీనివాస్, డివి మారుతిరావు, ముద్దసాని శంకరయ్య, ముద్దం విక్రమ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



ఇమామ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఆగస్ట్ 14 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కాష్‌పల్లి వద్ద రోడ్డుపై వీర్నపల్లికి చెందిన సయ్యద్ ఇమామ్(55) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. వీర్నపల్లికి చెందిన ఇమామ్ కూలి చేసుకుంటూ జీవించేవాడు. ఎల్లారెడ్డిపేటలో ఉంటున్న తన కొడుకు వద్దకు ఇమామ్ ద్విచక్ర వాహనంపై మంగళవారం వెళ్లి అదే రోజు తిరిగి వీర్నపల్లికి వెళతున్నాని చెప్పి అక్కడి నుంచి బయలుదేరాడు. మరుసటి రోజు తుర్కాష్‌పల్లి వద్ద ఇమామ్ రోడ్డుపై అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. రోడ్డుపై ఇమామ్ మృతి చెంది ఉండటంతో పోలీస్‌లు వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులు అక్కడికి చేరుకున్నారు. ముఖానికి తీవ్ర గాయాలై తలపగిలి ఇమామ్ మృతి చెంది ఉన్నాడని, మృతిపై అనుమానాలు ఉన్నాయని వారు ఆరోపించారు.వాహనం కూడా సంఘటన స్థలం వద్ద లేదని మృతుడి కొడుకు భాష పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పూర్తి స్థాయిలో విచారణ చేసి, తన తండ్రి మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఎస్ఐ రాంమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14: మండలంలోని గండ్రపల్లిలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 16.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన చింతల ప్రసాద్ ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా, అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌లు తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

బస్సు పునరుద్ధరణ

ముత్తారం, ఆగస్టు 14 : అడవిశ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వెళ్లే గోదావరిఖని డిపో బస్సు కొన్ని రోజుల నుంచి బంద్ కావడంతో గ్రామస్థులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, గ్రామ మాజీ ఎంపీటీసీ దొడ్డ బాలాజీ గీతారాణి దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సంబంధిత అధికారులకు గతంలోలాగా బస్సు నడపాలని ఆదేశించారు. బుధవారం నుంచి యథావిధిగా బస్సు నడుస్తుందని అధికారులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని రామరావుపల్లిలో బుధవారం టిప్పర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో పోల్ విరిగి వైర్లు కిందికి వాలడంతో కొద్ది సమయం పాటు అటువైపు భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకొని మరమ్మతు పనులు చేపట్టారు.

పాము కాటుతో ఆవు మృతి

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో బదావత్ రవికి చెందిన జెర్సీ ఆవు బుధవారం ఉదయం పాముకాటుతో మృతిచెందింది. బాధితుడు రవి పశువుల వైద్యునికి, టోల్ ఫ్రీ నెంబర్‌కు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా ఎవరు స్పందించలేదని రవి ఆరోపించాడు. ఆవు ఖరీదు 50 వేల విలువ ఉంటుందని బాధితుడు తెలిపాడు.

'డీజిల్ పోయించకుండా ఇబ్బందులు'

కోల్‌సిటీ, ఆగస్టు 14: రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగం అవినీతిమయమైందని, పారిశుధ్య వాహనాలకు డీజిల్ పోయించకుండా ఇబ్బందులకు గురి చేసున్నారని ఏఐటీయూసీ నాయకుడు ఎంఏ గౌస్, డీహెచ్‌పీఎస్ నాయకుడు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ఆఫీస్ కార్నర్ వద్ద చెత్త ట్రాక్టర్ డీజిల్ లేక ఆగిపోయిందని, డ్రైవర్ ఖాజిపల్లి బంక్‌కు వెళ్లి డీజిల్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక ట్రాక్టర్‌కు రోజుకు 7లీటర్ల డీజిల్ పోయాల్సి ఉండగా వారానికి 35లీటర్లు పోస్తున్నారని దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు.

నేత్రదానంతో ఎందరికో చూపు..

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14: నేత్రదానంతో ఎందరికో చూపు వస్తుందని సదాశియ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి అన్నారు. బుధవారం మండలంలోని మిర్జంపేట గ్రామానికి చెందిన రామిని తిరుపతమ్మ సంస్మరణ సభ జరిగింది. తిరుపతమ్మ కళ్ళను ఆమె కుమారులు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. మృతురాలి కుటుంబీకులను అభినందించి జ్ఞాపికను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి, బచ్చు శివకుమార్, చిదురాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం..

ఓదెల, ఆగస్టు 14 : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఏడీపీహెచ్‌వో డాక్టర్ అన్నప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య శిబిర్‌లో భాగంగా వైద్యాధికారి అన్నప్రసన్న సందర్శించారు. అనంతరం ఆసుపత్రితో పాటు పొత్కపల్లిలో రోగులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వానాకాలం పూర్తి అయ్యేవరకు నీటిని వేడిచేసి తాగాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ షేహబజ్ ఖాన్, ఎంఎల్‌హెచ్ సృజన, సూపర్‌వైజర్ రాణి, విద్యాసాగర్, సిబ్బంది సమ్మయ్య వాజిదా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథనిరూరల్, ఆగస్టు 14:మండలంలోని సూరయ్యపల్లి గ్రామంలో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. ఆకుల లక్ష్మి మరణించగా పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో వెల్పుల మధునయ్య ఇటీవల మరణించగా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, విజయ్‌కుమార్‌లు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని పుట్నూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు బుధవారం పుట్నూర్ పీఎస్ వైద్యుడు సాయి సూర్య పరిక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం సరిత,ఆశావర్కర్లు,అ పాఠశాల ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 14: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ నాయకులు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. షిర్కే బస్టాప్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు ఉన్న దుకాణ దారులకు జండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మూకిరి రాజు, ఆకుల శశి, దాసరి శ్రీనివాస్, మారెపల్లి శ్రీనివాస్, పొట్ల వెంకటి, జంజర్ల శ్రీనివాస్, పాష, కోటి, కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నపేటలో వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 : మండలంలోని అప్పన్నపేటలో బుధవారం రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పల్లె దవాఖాన వైద్యురాలు సౌమ్య వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీచేశారు. ఆశాకార్యకర్తలు స్వరూప, రాజేశ్వరి పాల్గొన్నారు.

ట్రీగార్డుల ఏర్పాటు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 : మండలంలోని కాపులపల్లిలో ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు రక్షణగా ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి అంజద్ పాష మాజీ ఉపసర్పంచ్ అశోక్, ఉన్నారు.

ఇళ్ల స్థలాలపై ఆశలు గల్లంతేనా..?

- రామగుండంలో భూఆక్రమణల్లో రూ.2.5కోట్లు పోగొట్టుకున్న బీదలు - సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నిర్మాణాలు

- కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో రెండేళ్లు ముంపు - మిగతా నిర్మాణాలదీ అదే పరిస్థితి..

కోల్‌సిటీ, ఆగస్టు 14: రామగుండంలో భూఆక్రమణల పేరిట పేదలు సుమారు రూ.2.5కోట్లు నష్టపోయారు. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో ఉండే పేదలు భూపోరాటాల్లో తమకు ఇళ్లస్థలాలు వస్తాయనే గంపెడాశతో రాత్రిపగలు చీకట్లోనే మగ్గి, స్థలం కోసం నానా తంటాలు పడ్డారు. ఇదిగో పట్టా వస్తుంది, అదిగో పట్టా వస్తుందనే పరిస్థితుల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టి షెడ్లు నిర్మించుకున్నారు. ఒక్కో షెడ్డుకు రూ.1.2లక్షల నుంచి రూ.1.5లక్షల వరకు ఖర్చుపెట్టారు. నిర్మాణ గుత్తాల పేర నిర్ణయించిన రేటుకు చెల్లింపులు జరిపారు. చివరికి నిర్మాణ సమయాల్లో డ్రమ్ము నీళ్ల కూడా కొనుగోలు చేసి మరి నిర్మాణాలు జరిపారు. మల్కాపురం సీవరేట్ ట్రీట్ ప్లాంట్‌కు చెందిన పాండ్లు(కుంటలు)ల్లో ఈ నిర్మాణాలు జరిపారు. ఈ పాండ్లు రెండేళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు సుందిళ్ల బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యాయి. మున్సిపల్ ఆధీనంలోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ముంపు ప్రాంతం అని తెలిసినా కూడా నిర్మాణాలను ప్రోత్సహించారు. భూపోరాట ప్రారంభంలోనే గోదావరి బ్యాక్‌వాటర్‌తో ముంపు ఏర్పడింది. కవర్లతో వేసిన గుడిసెలు కూడా నీటిలో మునిగిపోయే ఉన్నాయి. ప్రారంభంలోనే మున్సిపల్ యంత్రాంగం గుడిసెలను తొలగించింది. ఈ స్థలం రెవెన్యూ స్థలం కాదని, మున్సిపల్ స్థలమని ఆక్రమణదారులకు సమాచారం కూడా ఇచ్చింది.

అమృత్ పనులు జరుగుతాయని తెలిసీ..

గోదావరి జలాలు కాలుష్యం కాకుండా నివారించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం అమృత్‌పథకంలో ఎస్‌టీపీల నిర్మాణాలకు నిధులు మంజూరుచేసింది. రామగుండానికి ఈమేరకు రూ.100కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. మల్కాపూర్ శివారులో ఇప్పటికే ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు 37ఎకరాలు అందుబాటులో ఉండగా నిర్మాణం జరుపాలని నిర్ణయించారు. మొదట జనగామ శివారు సర్వే నెం.814, 815 పరిధిల్లో భూఆక్రమణలు జరుగగా అనంతరం మొత్తం ఎస్‌టీపీ పాండ్‌లలోనే నిర్మాణాలు జరిగాయి. వాస్తవానికి అమృత్ పనులు జరుగుతాయని ఆక్రమణలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారికి అవగాహన లేని పరిస్థితి ఉండదు. అయినా నిర్మాణాలను ప్రోత్సహించారనే ఆరోపణలున్నాయి.

ఎస్‌టీపీలకు భూముల కొనుగోలు..

2004లో కేంద్ర ప్రభుత్వం గంగాశుద్ధి ప్రాజెక్టు తరహాలో గోదావరి శుద్ధి చేయాలని నిర్ణయించింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మంచిర్యాల, రామగుండం, భద్రాచలంలో నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టు(ఎన్‌ఆర్‌సీపీ)లో భాగంగా గోదావరి జలాల కాలుష్య నివారణ పథకాన్ని చేపట్టింది. ఈ మేరకు రామగుండం, మల్కాపూర్‌లలో ఎస్‌టీపీల నిర్మాణాన్ని జరిపింది. 2004లో మల్కాపురం ఎస్‌టీపీకి ఒక ఎకరం 30గుంటల ప్రభుత్వ స్థలంతో పాటు 38.26 ఎకరాల పట్టా భూములను సేకరించారు. ఇందుకు సంబంధించిన నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉంటామని ఎస్‌టీపీలను పరిరక్షిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఎన్‌జీటీలో కేసు సమయంలో కూడా ఎస్‌టీపీలు తమ ఆధీనంలో ఉన్నాయని పేర్కొంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ నిబంధనల ప్రకారం ఎస్‌టీపీల వద్ద నిర్మాణాలకే అనుమతి లేదు. ఎన్‌జీటీ సాంకేతికంగా మల్కాపురం ఎస్‌టీపీ స్థలం రెవెన్యూ స్థలం కాదు. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలం. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న ఈ స్థలంలో పట్టాలు ఇవ్వాలంటే కూడా సాంకేతిక అవరోధాలను అధిగమించాల్సి ఉంటుంది.



ఎస్‌టీపీ పాండ్‌లో నిలిచిన నీరు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ముత్తారం, ఆగస్టు 14 : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ముత్తారం మండలంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పర్యటించారు. మండలంలోని మైదంబండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అడవిశ్రీరాంపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులలో విద్యాబోధనను తనిఖీచేసి విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అడవిశ్రీరాంపూర్ జడ్పీహెచ్‌ఎస్ ప్రహరీ గోడ మరమ్మతులకు అవసరమైన అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు కలెక్టర్ టీ షర్ట్‌లు అందజేశారు.

మిల్క్ పార్లర్ ప్రారంభం..

మండల కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం కింద శ్రీరాజమాత గ్రామ సంఘం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మిల్క్ పార్లర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాలు అందజేసి వారి వ్యాపార యూనిట్ల ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో 12 రకాల వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలచే మీసేవ కేంద్రాలు ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద లక్షా 90 వేల రుణంతో ముత్తారంలో మిల్క్ పార్లర్ ఏర్పాటు చేశామని, దీనినే సమర్థవంతంగా నిర్వహించుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిలవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ అవకాశాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక రీచ్ పరిశీలన..

ముత్తారం మండలంలో ఖమ్మంపల్లి గ్రామంలో ఇటీవలే ప్రారంభించిన ఇసుక రీచ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ముత్తారం ఎంపీడీవో జి లలిత, మండల పంచాయతీ అధికారి బి కిరణ్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.వరలక్ష్మి, ఏడీఎం డి .పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పలకల పంపిణీ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 14: స్థానిక 38వ డివిజన్‌లో కాంగ్రెస్ మహిళా బీసీసెల్ అధ్యక్షురాలు పోరండ్ల శారద ఆధ్వర్యంలో సంజయ్‌గాంధీనగర్, ఇందిరానగర్‌లోని అంగవాడీ కేంద్రాలలోని పిల్లలకు ఉచితంగా పలకలు అందజేశారు. అనంతరం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించి చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మమత, అంగన్‌వాడీ టీచర్ ఉండ ఉమా, బొడిగె రమా, మల్లేశ్వరి, ఆయా తౌటం శాంత, కాలనీమహిళలు పాల్గొన్నారు. అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో చదువుతున్న ఎండి ఇజహాన్, పి.శాలెం అనే విద్యార్థులకు నాంపల్లిరాజ్ 1116 అందజేశారు. దళితరత్న అవార్డుగ్రహీత డాక్టర్ దేవిలక్ష్మీనర్సయ్య, కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి, సం తోష్ పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని గాంధీనగర్‌లోని గాంధీ పార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు మంథని మధునయ్య, ఆర్.ప్రియదర్శిని, కె.రాజేశ్వరి, ఎం.జానకిలను రామగుండం మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య సత్కరించారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి

మంథని, ఆగస్టు 14: పెద్దపల్లిలోని ఈనెల 20న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయటానికి అధిక సంఖ్యలో జిల్లాలోని బీసీలంతా కదలిరావాలని బీసీ సంఘం నేతలు కోరారు. స్థానిక మహాత్మా జ్యోతిబాఫూలే విగ్రహం వద్ద బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, బత్తుల సత్యనారాయణ, పోతరవేన క్రాంతికుమార్, పోలు కనుకరాజ్, పుప్పాల తిరుపతి, జంగపల్లి కనుకయ్య, అడిచర్ల సమ్మయ్య, ఆసీఫ్, ఇర్ఫాన్, మోహన్, శ్రీనివాస్, కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం జప్తునకు వచ్చిన రైతులు

- కలెక్టర్ చొరవతో వాయిదా



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన రైతులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 14: కోర్టు ఆదేశాలతో అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతులు బుధవారం ఆర్డీవో కార్యాలయం జప్తు చేసేందుకు తమ న్యాయవాది విక్రమ్‌రెడ్డితో వచ్చారు. అయితే కలెక్టర్ చొరవతో వారు తిరిగి వెళ్లారు. వివరాల్లోకి వెళితే.. 1997 రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(ఆర్టీపీఎస్)ఎక్స్‌టెన్షన్ కోసం 750ఎకరాలు అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో మొత్తం 300 మంది రైతుల నుంచి భూమి సేకరించారు. ఇట్టి భూమికి అప్పట్లో ఎకరానికి 20 వేల రూపాలయల వరకు ధర నిర్ణయించారు. అయితే ఆర్టీపీఎస్ సంస్థ రైతులకు డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో బ్రిటీష్ ఫిజికల్ ల్యాబరెటీస్(బీపీఎల్) సంస్థకు అప్పగించింది. ఆయనా రైతులకు ఏలాంటి నష్ట పరిహారం చెల్లించకపోవడంతో రైతులు సెక్షన్ 18 ప్రకారం 2014లో కోర్టును ఆశ్రయించారు. అప్పటి కోర్టు ఎకరానికి 95వేల రూపాయల చొప్పున చెల్లించాలని పెద్దపల్లి కోర్టు తీర్పునిచ్చింది. మొత్తం 300 మంది రైతులకు 36 మంది రైతులు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల్లో రైతులకు మొత్తం 2 కోట్ల 11 లక్షల 69 వేల, 773 రూపాయలు చెల్లించాలని ఆర్డర్ ఇచ్చింది. అయినా చెల్లిపంపులు జరుగకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద గోదావరిఖని సెషన్ కోర్టులో ధిక్కరణ కేసు నమోదు చేయగా జూలై 2న ఆగస్టు 20 లోపు ఆర్డీవో కార్యాలయం జప్తు చేసుకోవాలని తీర్పునివ్వడంతో బుధవారం రైతులు ఆర్డీఓ కార్యాలయానికి తమ న్యాయవాదితో వచ్చారు. ఆర్డీవో అందుబాటులో లేక పోవడంతో కార్యాలయ ఏవోతో సంప్రదింపులు జరిపారు.

ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్ళింది. ఆర్డీవో కార్యాలయానికి ఫోన్ చేసి రైతులు, న్యాయవాదితో కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడారు. ఈనెల 19 వరకు రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తిరిగి వెళ్లిపోయారు.



ఉత్తమ కార్మికులు వీరే..

రామగిరి, ఆగస్టు 14: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిప డివిజన్‌లలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేస్తు యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 ఇపీ ఆపరేటర్ అబ్దుల్‌రజాక్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎఎల్‌పి ఫోర్‌మెన్ బనోత్ కార్తీక్ ఎంపికయ్యారు. వీరిని సీఎండీ సత్కరించనున్నారు.

ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

గోదావరిఖని, ఆగస్టు 14: బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేస్తూ, ఆ బ్లాకులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఐక్య వేదిక నాయకులు హెచ్‌ఎంఎస్ నుంచి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ నుంచి సాలిగామ మల్లేష్, టీఎస్‌యూఎస్ నుంచి కామెర గట్టయ్య ఏఐఎఫ్‌టీయూ నాయకులు జీ రాములు, ఐఎఫ్‌టీయూ నాయకుడు రాజేందర్, టీఎస్ టీఈయూసీ నుంచి ఏడు కొండలు హాజరయ్యారు. ధర్నా సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం పేరుతో సింగరేణితో పెట్టుకుంటే పుట్టగతులుండవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సింగరేణి పట్ల బూర్జువ పార్టీల ద్వంద వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్‌లో 8సీట్లు ఇస్తే కృతజ్ఞతతో ఉండాల్సింది పోయి సింగరేణిని అంతం చేయడానికి వారు కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బొగ్గుశాఖ మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని సింగరేణిని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేట్ పరం కాదని ప్రకటనలు చేస్తూ బొగ్గు బ్లాకులను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నించడం ద్వంద్వ విధానమన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో హెచ్‌ఎంఎస్ నాయకులు ఎండీ ఖయ్యాం, కొమురయ్య, రాంచందర్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఈ నరేష్, ఎం దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు నీరటి రాజన్న, దేవి సత్యం, కుమారస్వామి, ఇఫ్టు నాయకులు ఈ రామకృష్ణ, గుండేటి మల్లేష్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు పోచమల్లు, రాజమల్లు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక నాయకులు

మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రిక్ బైక్‌లు



ఎలక్ట్రిక్ బైక్‌ను విడుదల చేస్తున్న ఎంవీఐ సంతోష్‌రెడ్డి

జ్యోతినగర్, ఆగస్టు 14 : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బైక్‌లు మార్కెట్లో విడుదలయ్యాయి. ఎన్టీపీసీలోని బజాజ్ షోరూంలో బుధవారం కొత్త ఎలక్ట్రిక్ చేతక్ బైక్‌ను రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సంతోష్‌రెడ్డి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం నుంచి ఎలక్ట్రిక్ బైక్‌లకు సబ్సిడీ లభిస్తున్నదని ఎంవీఐ తెలిపారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ రవికుమార్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని జీడినగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 561లో బుధవారం అక్రమ కట్టడాలను అధికారులు కూల్చి వేయించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రి రేకుల షెడ్ల నిర్మాణం చేపట్టారని కొంతమంది వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశంతో బుధవారం తహసీల్దార్ ఎం జ్యోతి, ఎంపీవో సుదర్శన్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రికెట్‌లో విద్యార్థుల ప్రతిభ



అండర్-14 పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

పాలకుర్తి, ఆగస్టు 14: మండలం పరిధిలోని బసంత్‌నగర్ ఇండియా మిషన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు పెసరి అక్షిత్, చొప్పదండి సాయికుమార్‌లు క్రికెట్‌లో ప్రతిభ చూపి ఈనెల 16 నుంచి 18 వరకు తమిళనాడులో జరిగే అండర్-14 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణమూర్తిగౌడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేంద్ర, ఉపాధ్యాయులు, కేశోరాం కంపెనీ అధికారులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

గీత కార్మికులు కాటమయ్య రక్షణ కవచం వినియోగించాలి

-జిల్లా ఎక్సైజ్ అధికారి మహిపాల్ రెడ్డి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 : గీత కార్మికులు ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచాన్ని వినియోగించాలని జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పెద్దకల్వలలో గీత కార్మికులకు, గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.అనిల్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బుధవారం మొత్తం 35మంది గీత కార్మికులకు శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎక్సైజ్ సీఐ ఎం.శిరీష, ఎస్ఐలు జీవన్‌రెడ్డి, పావని, కానిస్టేబుల్‌లు సంతోష్ కృష్ణ, వనిత, దిలీప్ పెద్దపల్లి గౌడ సంఘం అధ్యక్షులు కొమురయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు

కమాన్‌పూర్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి పుణ్యక్షేత్రంలో ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు స్వామి వారి జయంత్యుత్సవాలు జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొనన కాంతారెడ్డి, అర్చకులు కలకుంట్ల వరప్రసాదచార్యులు బుధవారం తెలిపారు. 16న నిత్యాభిషేకం, గోపూజ, 17న ఆదివరాహస్వామి కల్యాణోత్సవం, నిత్య పూర్ణాహుతి, 18న సుప్రభాతం, గోపూజ, అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం, 108 కళశాలతో అభిషేకం ఉంటాయని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కమాన్‌పూర్, ఆగస్టు 14: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రసాద్ అన్నారు. బుధవారం కమాన్‌పూర్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో క్షణికావేశానికి లోనై ఘర్షణ వాతావరణం సృష్టించరాదన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు.

పేదల నుంచి డబ్బులు వసూలు చేయలేదు

-సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 14: గుడిసెలు వేసుకున్న పేదల వద్ద తాము డబ్బులు వసూలు చేయలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య, జిల్లా మహిళా కార్యదర్శి అనుముల మహేశ్వరి స్పష్టం చేశారు. బుధవారం పవర్‌హౌస్ కాలనీలో కూల్చివేసిన నిర్మాణాల వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని, కొంత మంది తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మొత్తం 163 ఇండ్లు నిర్మించుకున్నారని, ఇందులో 123 ఇండ్లను తొలగించారని, వీరికి నష్టపరిహారం ఇస్తామని స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హామీ ఇచ్చారన్నారు. మొదటి దఫాలోనే 123మందికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని అడిగినట్టు, దానికి కాంగ్రెస్ నాయకులు ముఖ్య నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు అంగీకరించారని చెప్పారు.

ఖని ఆసుపత్రిలో కీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం



కీలు మార్పిడి జరిగిన లింగమ్మతో కళాశాల ప్రిన్సిపాల్, వైద్యులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 14: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కీలు మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. గోదావరిఖని సంజయ్‌నగర్‌కు చెందిన ఆర్.లింగమ్మ(63) కొద్దిరోజులుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఆమె ఈనెల 1న గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రాగా ఆమెను ఆర్థో ప్రొఫెసర్లు రాజు, యాకూబ్ ఆమెకు పరీక్షలు నిర్వహించి మోకాలులోని కీలును తొలగించారు. మూడు రోజులకు ఆమెను డిశ్చార్జి చేశారు. బుధవారం ఆమె ఆసుపత్రికి రాగా కీళ్ల మార్పిడి విజయవంతం కావడంతో పాటు సాధారణ స్థితిలో ఆమె నడుస్తున్నట్టు ప్రొఫెసర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఆపరేషన్ నిర్వహించిన ఆర్థోప్రొఫెసర్లు రాజు, యాకూబ్‌తో పాటు అనస్తిషియా, నర్సింగ్ సిబ్బందిని వారు అభినందించారు.